# తిరుప్పరంకుండ్రం ఉద్రిక్తం



బుధవారం సాయంత్రం పర్వతంపైన ఎప్పటిలానే ఉచ్చిపిళ్లయార్ వద్దే వెలిగించిన కార్తీకదీపం



తిరుప్పరంకుండ్రం రహదారిలో పోలీసులు, హిందూ సంస్థ కార్యకర్తల మధ్య చోటుచేసుకున్న తోపులాట

**కార్తీకదీపం కేసులో ప్రభుత్వానికి చుక్కెదురు**
**అప్పీలు పిటిషన్ తోసిపుచ్చిన ధర్మాసనం**
**సింగిల్ జడ్జి విచారణకు గ్రీన్‌సిగ్నల్**
**శిఖరాగ్రస్తంభంపైనే కార్తీక దీపం వెలిగించాలని సింగిల్ జడ్జి ఆదేశం**
**పిటిషనర్‌కు పటిష్టమైన భద్రతకు ఆదేశం**
**శాంతిభద్రతల సమస్య నెలకొంటుందని దీపం వెలిగించేందుకు పోలీసుల అనుమతి నిరాకరణ**
**బీజేపీ నేతల ఆందోళన.. తదితరుల అరెస్టు**

చెన్నై, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భక్తుల మనోభావాలు, న్యాయస్థానాల తీర్పులు, అమలులో అధికారుల తీరుతెన్నులు కలిసి మదురై జిల్లా తిరుప్పరంకుండ్రంను ఉద్రిక్తంగా మార్చాయి. భక్తిపారవశ్యంతో మునిగితేలాల్సిన ఆ ప్రాంతం.. ఆగ్రహావేశాలు, భద్రతా దళాల బూట్ల చప్పుళ్లతో అట్టుడికిపోయింది. దీంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ ఆ ప్రాంతంతోపాటు చుట్టుపక్కల జిల్లాలను కూడా ఉక్కిరిబిక్కిరి చేస్తోంది..

**ఇంతకీ ఏం జరిగింది..?**

మదురై హైకోర్టు బెంచ్ న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం తిరుప్పరంకుండ్రం పర్వతశిఖరాగ్రంపై ఉన్న దీపస్తంభంపై కార్తీక దీపం వెలిగించేందుకు పిటిషనర్ రామ్ రవికుమార్, ఆయన అనుచరులు ఆ కొండపైకి ఎక్కేందుకు బుధవారం ఉదయం 10 గంటల నుంచి సన్నాహాలు చేపట్టసాగారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వారి ప్రయత్నాలకు అడ్డుకట్ట వేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో పిటిషనర్ తరపు న్యాయవాదులు న్యాయమూర్తి జీఆర్ స్వామినాథన్‌కు ఫిర్యాదు చేయడంతో పిటిషనర్‌కు భద్రత కల్పించేందుకు హైకోర్టు ప్రాంగణం వద్ద విధులు నిర్వర్తించే కేంద్ర పారిశ్రామిక దళం (సీఐఎస్ఎఫ్) సభ్యులను పురమాయించారు. ఆ ప్రకారం కేంద్ర పారిశ్రామిక దళం సభ్యులను వెంటబెట్టుకుని పిటిషనర్ రామ్ రవికుమార్, పదిమంది అనుచరులు బుధవారం రాత్రి తిరుప్పరంకుండ్రం పర్వతశిఖరాగ్రానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. మదురై హైకోర్టు న్యాయవాదులు అరుణ్‌స్వామినాథన్, నిరంజన్ సహా ఆరుగురు న్యాయవాదులు, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ నేతృత్వంలో 65 మంది సాయుధదళ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న మదురై నగర పోలీసు కమిషనర్ జె.లోగనాధన్ అడ్డుకుని కొండపైకి వెళ్లి దీపస్తంభంపై కార్తీక దీపం వెలిగించేందుకు కోర్టు వెలువరించిన ఉత్తర్వుల సక్రమమైన కాపీ కావాలని న్యాయవాదులను అడిగారు. ఆ సందర్భంగా పోలీసు కమిషనర్‌కు, పిటిషనర్, ఆయన అనుచరులు, న్యాయవాదుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం జరిగింది. జిల్లా కలెక్టర్ ఆ ప్రాంతంలో 144వ సెక్షన్ విధించారని, కొండపైకి వెళ్లేందుకు ఎవరినీ అనుమతించే ప్రసక్తే లేదని కమిషనర్ స్పష్టం చేశారు. న్యాయవాదులు జోక్యం చేసుకుంటూ కోర్టు ఉత్తర్వుల ప్రకారం కనీసం పిటిషనర్‌నైనా కొండపైకి వెళ్లేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. ససేమిరా కుదరదంటూ పోలీసు ఉన్నతాధికారులు భీష్మించారు. ఆ సమయంలో పోలీసు కమిషనర్ లోగనాధన్ ఎవరితోనో పలుమార్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడి, సింగిల్ జడ్జి ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం అప్పీలుకు వెళ్లిందని, ఎవరినీ కొండపైకి వెళ్లేందుకు అనుమతించే ప్రసక్తే లేదన్నారు. ఆ సందర్భంగా గంటసేపు పోలీసు అధికారులకు, న్యాయవాదులు, పిటిషనర్, ఆయన అనుచరులకు మధ్య తీవ్రవాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో రాత్రి పది గంటల వరకూ ఆ ప్రాంతంలో భక్తులు తీవ్ర నిరసన తెలిపారు. చివరకు కొండదిగువనే పిటిషనర్, ఆయన అనుచరులు కర్పూరం వెలిగించి.. కొండపై దీపస్తంభంపైనే కార్తీక దీపం వెలిగించి తీరుతామంటూ శపథం చేశారు.

**నాటకీయ పరిణామాలు...!**

తిరుప్పరంకుండ్రం పర్వతంపై కార్తీక దీపం వెలిగించాలని సింగిల్ జడ్జి జీఆర్ స్వామినాథన్ జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలు పిటిషన్‌ను హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ గురువారం తోసిపుచ్చింది. అంతేకాకుండా తిరుప్పరంకుండ్రం దీపం కేసులో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయడానికి కూడా ద్విసభ్య ధర్మాసనం నిరాకరించింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలుపై గురువారం ఉదయం న్యాయమూర్తులు జస్టిస్ జయచంద్రన్, జస్టిస్ కేకే రామకృష్ణన్‌తో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఆ సందర్భంగా ప్రభుత్వం సమర్పించిన వాదనలో 'తిరుప్పరంకుండ్రం పర్వతంపై కార్తీక దీపం వెలిగించే విషయంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీలు చేసుకునే అవకాశం కల్పించలేదని, ప్రభుత్వం అప్పీలుకు సిద్ధమవుతుండగానే పిటిషనర్ (రామ్ రవికుమార్)ను ఆ కొండపై దీపం వెలిగించడానికి అనుమతి జారీ చేయడమే కాకుండా ఆయనకు హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ భద్రతా వ్యవహారాలకే పరిమితమైన కేంద్ర పారిశ్రామికదళం సభ్యులను పంపడం చట్టవిరుద్ధమని, గర్హనీయమని పేర్కొంది. సింగిల్ జడ్జి జారీ చేసిన ఉత్తర్వుల వల్ల తిరుప్పరంకుండ్రంలో శాంతి భద్రతలకు సంబంధించిన సమస్యలు ఏర్పడ్డాయని, మతసామరస్యాన్ని దెబ్బతీసిందని, పిటిషనర్‌తో పాటు పదిమంది వెళ్లి దీపం వెలిగించాలని ఆదేశిస్తే ఆయన పెద్ద బలగంతో కొండపైకి వెళ్లారని ఆరోపించింది. పిటిషనర్ ప్రధానోద్దేశం కార్తీక దీపం వెలిగించడం మాత్రమే కాదని, అల్లర్లను ప్రేరేపించడమేనని బుధవారం రాత్రి జరిగిన గొడవలు రుజువు చేస్తున్నాయని వివరించింది. కొంతమంది భక్తులు చేసిన దాడిలో పోలీసులు గాయపడ్డారని, కొండకు వెళ్లే దారులు దెబ్బతిన్నాయని, పిటిషనర్ రామ్ రవికుమార్‌పై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం కోరింది. శతాబ్దాల తరబడి ఆ పర్వంతపై ఆలయ నిర్వాహకులు కార్తీక దీపం వెలిగిస్తున్నారని, ప్రత్యేకించి దీపస్తంభంపై కార్తీక దీపాన్ని వెలిగించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రభుత్వం ప్రశ్నించింది. పిటిషనర్ తరఫు న్యాయవాదులు ప్రభుత్వ వాదనలను తోసిపుచ్చారు. సింగిల్ జడ్జి సక్రమంగా విచారణ జరిపిన మీదటే దీపస్తంభంపై కార్తీక దీపం వెలిగించాలని ఉత్తర్వులిచ్చారని, ఆ ఉత్తర్వులను ఆలయ నిర్వాహకులు, పోలీసులు పట్టించుకోలేదని, వీటన్నింటికి తోడు అనవసరంగా ఆ కొండపై అప్పటికప్పుడు 144వ సెక్షన్ విధించారని ఆరోపించారు. అన్ని పక్షాల వాద ప్రతివాదనల అనంతరం ధర్మాసనం తీర్పును సాయంత్రం 4 గంటలకు ప్రకటించనున్నట్లు తెలిపింది. ఆ ప్రకారం తిరుప్పరంకుండ్రం పర్వతంపై ఉన్న ఉచ్చిపిళ్లయార్ ఆలయ మండపం వద్ద కాకుండా, పర్వత శిఖరాగ్రంలో ఉన్న దీపస్తంభంపై కార్తీకదీపం వెలిగించాలని న్యాయమూర్తి జీఆర్ స్వామినాథన్ జారీ చేసిన ఉత్తర్వుల సబబేనంటూ ధర్మాసనం తీర్పు వెలువరించింది. ప్రభుత్వం ఈ విషయంలో ఏదో ఒక బలమైన కారణంతో అప్పీలు పిటిషన్ జారీ చేసినట్లు అవగతమవుతోందని పేర్కొంటూ అప్పీలు పిటిషన్‌ను తోసిపుచ్చుతున్నట్లు ప్రకటించడంతోపాటు ఈ కేసుపై న్యాయమూర్తి జీఆర్ స్వామినాథన్ విచారణను కొనసాగించవచ్చని ఆదేశించింది. ఆ ప్రకారమే గురువారం సాయంత్రం న్యాయమూర్తి జీఆర్ స్వామినాథన్ విచారణను ప్రారంభించి కొన్ని ఉత్తర్వులు జారీ చేశారు. తిరుప్పరంకుండ్రం పర్వత ప్రాంతం, ఆలయ పరిసరాలలో విధించిన 144వ సెక్షన్ ఆదేశాలను రద్దు చేశారు. గురువారం సాయంత్రమే పిటిషనర్ రామ్ రవికుమార్ పదిమందితో వెళ్లి పర్వతశిఖరాగ్రంపైనున్న దీపస్తంభంపై కార్తీక దీపం వెలిగించాలని, ఆ సందర్భంగా పిటిషనర్‌కు, ఆయన అనుచరులకు మదురై నగర పోలీసు కమిషనర్ లోకనాథన్ పటిష్టమైన భద్రతా ఏర్పాటు చేపట్టాలని ఉత్తర్వులు జారీచేశారు. కార్తీకదీపం కార్యక్రమం తాను ఆదేశించిన తీరులో జరిగిందనే విషయాన్ని నివేదికను శుక్రవారం దాఖలు చేయాలని పోలీస్‌శాఖను ఆదేశించారు.

**మళ్లీ ఉద్రిక్తం**

హైకోర్టు ఆదేశాల అనంతరం పిటిషనర్ రామ్ రవికుమార్‌తో పాటు వందలాదిమంది బీజేపీ కార్యకర్తలు తిరుప్పరంకుండ్రం కొండ దీపస్తంభంపై దీపం వెలిగించేందుకు గురువారం రాత్రి 7 గంటలకు బయలుదేరారు. అయితే శాంతిభద్రతల సమస్యల నెలకొంటుందంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల తీరును నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, సీనియర్ నేత హెచ్.రాజా తదితరులు ఆందోళన చేపట్టారు. అక్కడ పరిస్థితి చేయిదాటుతుండడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి వేరే ప్రాంతానికి తీసుకెళ్లారు. దీంతో తిరుప్పరంకుండ్రంలో మళ్లీ ఉద్రిక్తత నెలకొంది.

**సుప్రీం తలుపుతట్టిన రాష్ట్ర ప్రభుత్వం**

హైకోర్టు తీర్పు పట్ల అసంతృప్తి చెందిన రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు తలుపుతట్టింది. తిరుప్పరంకుండ్రంలో శాంతిభద్రతల సమస్య నెలకొనే అవకాశం ఉన్నందున హైకోర్టు తీర్పును నిలుపుదల చేయాలని అభ్యర్థించింది. రాష్ట్ర న్యాయశాఖ మంత్రి రఘుపతి విలేకరులతో మాట్లాడుతూ 2014లో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలనే తాము ఆచరిస్తున్నామని, దీనికి భిన్నంగా హైకోర్టు తీర్పునివ్వడం సరికాదని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా దీనిని రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు.

**హాజరైన కలెక్టర్, పోలీసు కమిషనర్**

ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం ఆదేశం ప్రకారం న్యాయమూర్తి జీఆర్ స్వామినాథన్ విచారణచేపట్టినప్పుడు మదురై నగర పోలీసు కమిషనర్ లోకనాథన్, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. తిరుప్పరంకుండ్రం దీపస్తంభంపై పిటిషనర్, ఆయన అనుచరులు పదిమంది కలిసి కార్తీకదీపం వెలిగించేందుకు తాను జారీ చేసిన ఉత్తర్వులు ఎందుకు సక్రమంగా అమలు చేయలేదని కమిషనర్‌ను, కలెక్టర్‌ను న్యాయమూర్తి నిలదీశారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడటం వల్లే ఘర్షణలు నివారించే దిశగా 144వ సెక్షన్ విధించినట్లు ఇరువురూ వివరణఇచ్చారు. మదురై నగర పోలీసు కమిషనర్ పిటిషనర్‌కు, ఆయన అనుచరులకు తగినంత భద్రత కల్పించి ఉంటే పరిస్థితి దారుణంగా మారేది కాదని న్యాయమూర్తి పేర్కొన్నారు. పిటిషనర్ దీపం వెలిగించేందుకు వెళుతుండగా మదురై నగర పోలీసు కమిషనర్ అడ్డుకోవడాన్ని తాను గమనించినట్లు చెప్పారు. ఈ పరిస్థితులలో గురువారం సాయంత్రం పిటిషనర్ ఆ కొండపైన దీపస్తంభంపై వెలిగించేందుకు పోలీసులు పటిష్టమైన భద్రత కల్పించాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఈ ఉత్తర్వులను స్వాగతిస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ నాయకులు నయినార్ నాగేంద్రన్, తమిళిసై సౌందరరాజన్ ప్రకటనలు జారీ చేశారు. డీఎంకే ప్రభుత్వానికి ఈ ఉత్తర్వులు చావుదెబ్బలాంటివని పేర్కొన్నారు. అదేసమయంలో డీపీఐ నేత తిరుమావళవన్, సీపీఎం నేత షణ్ముగం సింగిల్‌జడ్జిని ఆపదవినుండి తొలగించాలని డిమాండ్ చేశారు.

# అన్నాడీఎంకే కూటమిలోకి పీఎంకే?

● **ఈపీఎస్‌తో అన్బుమణి వర్గం భేటీ**

ప్యారీస్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే కూటమిలో పీఎంకే చేరడం దాదాపు ఖరారైనట్లు తెలిసింది. మరో నాలుగు నెలల్లో రాష్ట్ర అసెంబ్లీకి జరుగనున్న ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకే సహా అన్ని పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే డీఎంకే నేతృత్వంలో ఇండియా కూటమి, అన్నాడీఎంకే సారథ్యంలో ఎన్డీయే కూటమిలో పొత్తు గురించి విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) రెండుగా చీలడంతో ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ మద్దతుదారులు ఒక వర్గంగా, రాందాస్ కుమారుడు మాజీ ఎంపీ అన్బుమణి మద్దతుదారులు ఒక వర్గంగా వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పీఎంకే ఏ కూటమిలో చేరుతుందని రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కూటమిలో ఉన్న పీఎంకేకు ఒక్క సీటు కూడా దక్కలేదు. ఇందువల్ల ఎన్డీయే కూటమి నుంచి వైదొలిగిన రాందాస్, మళ్లీ ఆ కూటమిలో చేరేందుకు ఆసక్తి చూపలేదు.



అన్నాడీఎంకే చీఫ్ ఈపీఎస్‌కు పుష్పగుచ్ఛం సమర్పిస్తున్న పీఎంకే నేతలు

దాదాపు అన్నాడీఎంకే కూటమిలో చేరే అవకాశాలు ఉన్నట్లు రాందాస్ వర్గీయులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో, స్థానిక అడయార్‌లోని గ్రీన్‌వేస్ రోడ్డులో ఉన్న సెవ్వంది నివాసంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)ని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి మద్దతుదారులు సీనియర్ న్యాయవాది కె.బాలు, పీఎంకే రాష్ట్ర ఎన్నికల కమిటీ కార్యదర్శి ఎం.జయరామన్, గణేష్‌కుమార్‌లు గురువారం మర్యాదపూర్వకంగా సంప్రదించారు. సుమారు గంటకు పైగా సాగిన ఈ సమావేశంలో, 2026 మే నెలలో నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమిలో పీఎంకే చేరడం, ఏఏ స్థానాల్లో విజయావకాశాలు అధికంగా ఉన్నాయి? పొత్తు ఖరారైతే కూటమి తరుపున చేపట్టాల్సిన ప్రచారవ్యూహం తదితర అంశాలపై రెండు పార్టీల నేతలు చర్చించినట్లు సమాచారం. ఈ భేటీతో అన్నాడీఎంకేతో పొత్తు ఖరారైనట్లు స్పష్టమైంది. ఇదిలా వుండగా, ఈపీఎస్‌తో అన్బుమణి మద్దతుదారుల భేటీపై రాందాస్ ఆందోళనకు గురైనట్లు తెలిసింది.

# లెజండరీ నిర్మాతకు కోలీవుడ్ కన్నీటి వీడ్కోలు

● ఏవీఎం శరవణన్‌కు ప్రముఖుల నివాళి



వృద్ధాప్యం కారణంగా గురువారం ఉదయం తుదిశ్వాస విడిచిన లెజండరీ సినీ నిర్మాత ఏవీఎం శరవణన్ భౌతికకాయాన్ని స్థానిక సాలి గ్రామంలోని ఏవీఎం స్టూడియోలో సందర్శించి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

# హమ్మయ్య కాస్త తెరపిచ్చింది!

● శాంతించిన వర్షం



కోయంబేడు వద్ద వర్షంలో గొడుగులు పట్టుకుని వెళుతున్న నగరవాసులు

చెన్నై, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): 'దిత్వా' తుపాను, ఈశాన్య రుతుపవన ప్రభావిత వర్షాల కారణంగా నాలుగు రోజులపాటు చెన్నై, పరిసర జిల్లాలను ముంచెత్తిన వర్షం గురువారం ఉదయం కాస్త తెరపిచ్చింది. మబ్బుల మాటునే దాగిన సూరీడు ఎట్టకేలకు బయటపడడంతో నగరవాసులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల దాకా నగరంలోను, తిరువళ్లూరు జిల్లా పరిసర ప్రాంతాల్లోనూ ఎండ బాగానే కాసింది. ఆ తర్వాత క్షణాలలోనే మళ్లీ ఆకాశం మేఘావృతమై జల్లులతో ప్రారంభమైన వర్షం కాస్త వేగం అందుకుంది. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో జోరుగా వర్షం కురిసింది. వడపళని, గిండి, ఆలందూరు, మీనంబాక్కం, పల్లావరం, క్రోంపేట, తాంబరం, పట్టినంబాక్కం, అంబత్తూరు, తిరుమంగళం, అన్నానగర్, మధురవాయల్, రాయపేట, ట్రిప్లికేన్, మైలాపూరు, విల్లివాక్కం తదితర ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం ఓ మోస్తరుగా వర్షం కురిసింది. ఇదే విధంగా తిరువళ్లూరు, కాంచీపురం జిల్లాల్లోనూ సాయంత్రం చెదురుముదురుగా వర్షం కురిసింది. ఇదిలా ఉండగా నగర శివారు ప్రాంతం రెడ్‌హిల్స్‌లో గత మూడు రోజులపాటు కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలో చేరిన వర్షపునీరు తొలగించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మాధవరం, వడపెరుంబాక్కం, రెడ్‌హిల్స్, విలాంగాడుపాక్కం, అలింజివాక్కం తదితర ప్రాంతాలు ఇంకా నీటిలోనే మునిగి ఉన్నాయి. ఈ నీటిని తొలగించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపించారు.

**3 జిల్లాలకు భారీ వర్ష సూచన**

శుక్రవారం తెన్‌కాశి, తూత్తుకుడి, తిరునల్వేలి జిల్లాల్లో భారీగా వర్షం కురిసే అవకాశం ఉందని స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు ప్రకటించారు. నగరానికి సంబంధించినంత వరకు ఆకాశం మేఘావృతమై ఉంటుందని, పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురుస్తుందని తెలిపారు. తిరువళ్లూరు, కాంచీపురం జిల్లాల్లో కొన్ని చోట్ల చెదురుముదురుగా వర్షం కురిసే అవకాశాలున్నాయని తెలిపారు.



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో బాలాంత్రపు శ్రీమతి రామనాథ్, వైవీ హరికృష్ణ, విస్తాలి శంకరరావు, గుడిమెట్ల చెన్నయ్య, ఎల్‌బీ శంకరరావు

# మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగుశాఖ సేవలు ప్రశంసనీయం

## గోపురం అధినేత వైవీ హరికృష్ణ

ప్యారీస్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ సాహితీ సేవలు ప్రశంసనీయమని గోపురం పసుపు, కుంకుమ అధినేత, లయన్ వైవీ హరికృష్ణ పేర్కొన్నారు. స్థానిక మెరీనా ఆవరణంలోని మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల 'ధర్మనిధి ఉపన్యాసాలు' కార్యక్రమాన్ని గురువారం ఉదయం 10.15 గంటలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైవీ హరికృష్ణ జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సభాధ్యక్షులు, తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకర్‌రావు మాట్లాడుతూ, వైవిధ్యమైన కార్యక్రమాలు చేపట్టడంతో భాగంగా ఈ ధర్మనిధి ఉపన్యాసాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక్కొక్క ధర్మనిధి ఉపన్యాసం ధర్మనిధి అంశాన్ని కలిగివుంటుందని పేర్కొన్నారు. అనంతరం ముఖ్య అతిథి వైవీ హరికృష్ణ ఇప్పటివరకు ధర్మనిధి ఉపన్యాసాలను సేకరించి ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించి తెలుగుశాఖ కార్యక్రమాలను ప్రశంసించారు. విలక్షణమైన సాహితీ కార్యక్రమాలకు తెలుగుశాఖ ప్రధాన వేదికగా ఉండటానికి విస్తాలి శంకర్‌రావు కృషి అభినందనీయమన్నారు. 98యేళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ శాఖను అభివృద్ధి పరచడంతో పాటు జాతీయస్థాయిలో నిర్వహించిన ధర్మనిధి ఉపన్యాసాలను పుస్తక రూపంలోకి తీసుకురావడం చాలా గొప్ప విషయమని ఆయన అన్నారు. ప్రత్యేక అతిథి ఇమ్మర్ బెన్సర్ కన్సల్టెంటింగ్ సీఈవో బాలాంత్రపు శ్రీమతి రామనాథ్, ఆత్మీయ అతిథి జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, రాజధాని కళాశాల విశ్రాంత ఆచార్యులు ఎల్‌బీ శంకరరావు ప్రసంగించిన ప్రారంభ సమావేశానికి డాక్టర్ పాండురంగం కాళియప్ప స్వాగతం పలుకగా, పెద్దోజు నరేష్ వందన సమర్పణ చేశారు. తొలిరోజు ఆచార్య గంధం అప్పారావు, ఆర్కాటు ప్రకాష్ రావు, ములుముడి ఆదిలక్ష్మి ధర్మనిధి ఉపన్యాసంపై ఆచార్య పీఎం గిరిష్, ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు, ఆచార్య గంపా వెంకటరామయ్య ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం అధ్యక్షులు తమ్మినేని బాబు, ప్రపంచ తెలుగు సమాఖ్య సంయుక్త కార్యదర్శి శ్రీలక్ష్మీ మోహన్‌రావు సహా తెలుగు భాషాభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఓటర్ల జాబితా నుంచి

# 59 లక్షల ఓట్ల తొలగింపు..!

● ఇందులో మరణించిన వారే 24 లక్షల మంది
● చిరునామా తప్పుగా వున్నవారు 27 లక్షల మంది



చెన్నై, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర ఓటర్ల జాబితా సవరణ(సర్)తో పలు లోపాలు బయల్పడుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మృతి చెందిన 24 లక్షల మంది పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగుతుండగా, 27లక్షలకుపైగా ఓటర్లు తమకు ఓటు హక్కు వున్నచోట కాకుండా వేరే ప్రాంతాల్లో నివశిస్తున్నట్లు తేలింది. దీంతో ఈ జాబితా సవరణ పూర్తయ్యేటప్పటికి 59 లక్షల ఓట్లు తొలగించే అవకాశముందని తెలిసింది. వచ్చేఏడాది రాష్ట్రఅసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ముమ్మరగా సాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా వున్న 6.41 కోట్ల మంది ఓటర్లలో ఇప్పటి వరకూ 6.37 కోట్ల మందికి అధికారులు దరఖాస్తులు పంపిణీ చేశారు. ఆ దరఖాస్తులను పూర్తి చేసిన ఓటర్లు వాటిని తిరిగి అధికారులకు అందజేస్తున్నారు. అయితే ఈ ప్రక్రియ నిదానంగా జరుగుతుండడంతో ఈ నెల 4వ తేదీ వరకు వున్న చివరి తేదీని ఈ నెల 11 వరకు పొడిగించారు. గత నెలాఖరులోఅందిన గణాంకాలప్రకారం రాష్ట్రం మొత్తమ్మీద 24 లక్షలమంది మరణించిన వారి పేర్లు ఇంకా జాబితాలో వున్నట్లు తేలింది. అదేవిధంగా 27 లక్షల 1050 మంది ఓటు హక్కు ఒకచోట, చిరునామా మరో చోట వున్నట్లు తేలింది. ఇవేవీ కాకుండా అసలు గుర్తించేందుకే వీలు లేకుండా 5 లక్షల 19 వేల మంది వున్నట్లు తెలిసింది. దీంతో మొత్తం 59 లక్షల మందిని ఎన్నికల జాబితా నుంచి తొలగించనున్నట్లు తెలిసింది. గత నవంబరు 29వ తేదీ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 50 లక్షల 91 వేల మంది ఓటర్లు తమ ఫారాలను ఇంకా సమర్పించలేదని తేలింది. ఈ పనులన్నీ పూర్తయ్యేటప్పటికి 69 లక్షల మందికి పైగా ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించాల్సి రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో చాలామంది నిజమైన ఓటర్ల పేర్లు జాబితాలో కనిపించడం లేదు. దీనికి పరిష్కారం కనుగొనేదిశగా ఎన్నికల కమిషన్ చర్యలు చేపడుతోంది.

## సమాచార దర్శిని

### విద్యా ఉపకార వేతనానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎంబీసీ, మైనార్టీ విభాగాలకు చెందిన 9నుంచి ప్లస్ వన్ చదివే విద్యార్థులు, ప్రధాన మంత్రి విద్యా ఉపకారవేతనానికి దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారుల కుటుంబ ఆదాయం రూ.2.50 లక్షలలోపు ఉండాలి. అర్హులైన విద్యార్థులు ఈనెల 15వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలి. వివరాలకు https://scholarship.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

### 16న ముసాయిదా ఓటరు జాబితా విడుదల

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముసాయిదా ఓటరు జాబితా ఈనెల 16వ తేదీన విడుదల చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్ తెలిపారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ప్రకటనలో... ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన గణన పనులు 11వ తేదీతో పూర్తికానున్నాయి. అనంతరం, 16వ తేదీన ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయనున్నారు. పంపిణీ చేయని గణన ఫారాల జాబితా, పేర్కొన్న చిరునామాలో లేని ఓటర్లు, శాశ్వతంగా మారిన వారు, మరణించిన వారు, ఓటర్ల జాబితాలో రెండుసార్లు నమోదుచేసుకున్న వారి జాబితాతో సహా ముసాయిదా ఓటర్ల జాబితా తయారు చేస్తున్నారు. ఈ జాబితా 11వ తేది తర్వాత ఖరారు చేయనున్నారు. అందువల్ల, ఓటర్లు తమ గణన ఫారాలు త్వరగా సమర్పించాలి. డిసెంబరు 16 నుంచి జనవరి 15వ తేది వరకు ముసాయిదా ఓటరు జాబితాలోని పేర్ల తొలగింపు, చేర్పులు, అభ్యంతరాలు తదితరాలు స్వీకరించనున్నారు. అర్హులైన ఏ ఒక్కరి పేరు ఓటరు జాబితా నుంచి తొలగించకుండా, అనర్హులైన ఏ వ్యక్తి పేరు చేర్చకుండా ఉండేలా ఓటరు నమోదు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి తెలిపారు.

### ప్రైవేటు పాఠశాలలకు ఫీజుల విడుదల

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో, గత రెండేళ్లకు సంబంధించి, ఆర్టీఈ ఫీజులు ప్రైవేటు పాఠశాలలకు రూ.875.83 కోట్లు విడుదల చేస్తూ జీవో విడుదలైంది. నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం, ప్రైవేటు పాఠశాలల్లో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉంది. అందుకు సంబంధించిన విద్యా ఫీజు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అందజేస్తుంటారు. గత 2013 నుంచి 2023 వరకు, ఎల్‌కేజీ నుంచి 8వ తరగతి వరకు చదివిన విద్యార్థినీ, విద్యార్థుల ఫీజు చెల్లించిన నేపథ్యంలో, 2023-24, 2024-25 విద్యాసంవత్సరాలఫీజు ప్రస్తుతం విడుదల చేస్తూ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ జీవో విడుదల చేసింది. ఆ ప్రకారం, 2023-24 విద్యా సంవత్సరానికి 7,594 పాఠశాలల్లో చదివిన విద్యార్థుల కోసం రూ.424 కోట్ల 98 లక్షల 89 వేల 724, 2024-25 సంవత్సరానికి 7,609పాఠశాలల్లో చదివిన 4,45,961 మంది విద్యార్థుల విద్యాఫీజుగా రూ.450కోట్ల 85లక్షల 9వేల 831 విడుదల చేస్తున్నట్లు జీవోలో తెలియజేశారు.

### టీఎన్‌పీఎస్సీ పరీక్షల టైంటేబుల్ విడుదల

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌పీఎస్సీ ఆధ్వర్యంలో, 2026వ సంవత్సరానికి గ్రూప్-1, గ్రూప్-2, 2ఏ, గ్రూప్-4 టైంటేబుల్ విడుదలైంది. తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-1, గ్రూప్-2, 2ఏ, గ్రూప్-4 సహా పలు పోటీ పరీక్షల ద్వారా భర్తీచేస్తోంది. ప్రతి ఏడాది పోటీ పరీక్షలు నిర్వహించే తేదీలను టీఎన్‌పీఎస్సీ విడుదల చేస్తుంది. ఆ ప్రకారం, 2026వ సంవత్సరానికి పోటీ పరీక్షల టైంటేబుల్‌ను టీఎన్‌పీఎస్సీ బుధవారం విడుదల చేసింది. గ్రూప్-1 పరీక్ష నోటిఫికేషన్ జూలై 7వ తేది విడుదల చేయనుండగా, సెప్టెంబరు 20వ తేదీన రాత పరీక్ష నిర్వహించనున్నారు. గ్రూప్-2 పరీక్ష నోటిఫికేషన్ ఆగస్టు 11న విడుదల చేసి, అక్టోబరు 25న రాతపరీక్ష, గ్రూప్-4 పరీక్ష నోటిఫికేషన్ అక్టోబరు 6వ తేదీన విడుదల చేసి, డిసెంబరు 20వ తేదీన రాత పరీక్ష జరుగుతుందని టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

### నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎగ్మూర్, ఆవడి, పెరంబూర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో వివరాలు ఇలా ఉన్నాయి... ఎగ్మూర్ పరిధిలో వెప్పేరి ఈవీకే సంపత్ రోడ్డు ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలోని నిర్వహణ ఇంజినీర్ కార్యాలయం, ఆవడి పరిధిలో మురుగప్ప పాలిటెక్నిక్ సమీపంలోని ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, పెరంబూర్ పరిధిలో సింప్సన్ ఎంఈఎస్ రోడ్డులోని సెంబియం ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో గ్రీవెన్స్ జరుగనుంది. ఈ గ్రీవెన్స్‌లో ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు పాల్గొని, విద్యుత్ కోతలు, కొత్త కనెక్షన్లు, మీటర్లు మరమ్మతులు సహా విద్యుత్ సంబంధిత సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు తెలిపింది.

### ప్లస్ టూ విద్యార్థుల వివరాల సవరణకు అవకాశం

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల వివరాల సవరణకు ప్రత్యేక అవకాశం కల్పించారు. ఈమేరకు ప్రభుత్వ పరీక్ష శాఖ విడుదల చేసిన ప్రకటనలో.. ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులవివరాల్లో లోపాలుంటే, వారి సవరణకు గత నెల 12వ తేది వరకు అనుమతించారు. తాజాగా, పలు పాఠశాలల యజమాన్యాల కోరిక మేరకు విద్యార్థుల వివరాల సవరణకు ఈనెల 6,7 తేదీల్లో ప్రత్యేక అవకాశం కల్పించారు. విద్యార్థుల పేర్లు, చిరునామా, సెల్‌ఫోన్ నెంబరు తదితరాల్లో లోపాలుంటే, ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులు వాటిని సవరించాలని ప్రభుత్వ పరీక్ష శాఖ తెలిపింది.

### ఎన్నికల అధికారుల నియామకం

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఏడాది ఏప్రిల్‌లో శాసనసభ ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల ఏర్పాటుపనులను ఎన్నికల కమిషన్ ముమ్మరంచేసింది. ఆప్రకారం, రాష్ట్రంలోని 234 నియోజకవర్గాలకు ఎన్నికల అధికారులు నియమితులయ్యారు. ఎన్నికల అధికారులుగా జిల్లా రెవెన్యూ అధికారి, సబ్‌కలెక్టర్‌హోదాస్థాయిఅధికారులను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ గెజిట్‌లో ప్రచురించారు.

## బంగారు నంది వాహనంపై ఊరేగిన

# అరుణాచలేశ్వరుడు

వేలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరుణాచలేశ్వరాలయంలో గత నెల 24వ తేదీ ప్రారంభమైన కార్తిక దీపోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో 1వ రోజైన బుధవారం రాత్రి బంగారు నంది వాహనంపై ఉన్నాములై అమ్మవారి సమేత అన్నామలైయార్‌ల ఉత్సవమూర్తులను అందంగా అలంకరింపజేసి ఆలయ మాడ వీధుల్లో అర్చకుల వేదమంత్రోచ్చారణ, భక్తుల ఓం నమశ్శివాయ దివ్యనామస్మరణ, మేళతాళాల నడుమ నిర్వహించిన ఊరేగింపు కన్నులపండువగా సాగగా, ఉత్సవానికి భక్తులు హారతులతో ఎదురొచ్చి దర్శించుకుని పులకించిపోయారు.



విద్యుద్దీపాల వెలుగులో తిరువణ్ణామలై క్షేత్రం



బంగారు నంది వాహనంపై కొలువైన ఉన్నాములై సమేత అన్నామలైయార్

### 13 వరకు తిరువణ్ణామలై మహాదీప దర్శనం

ప్యారీస్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై దివ్యక్షేత్రం అన్నామలైయార్ కొండ శిఖరంపై కార్తీక దీపోత్సవం సందర్భంగా వెలిగించిన మహాదీపాన్ని ఈ నెల 13వ తేదీ వరకు భక్తులు దర్శనం చేసుకోవచ్చని ఆలయ యాజమాన్యం ప్రకటించింది. 11 రోజులు పూర్తయిన తర్వాత దీపం వెలిగించిన లోహ పాత్రను కొండపై నుండి కిందకి తరలించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆ తర్వాత వెయ్యికాళ్ల మండపంలోని ప్రత్యేక గదిలో లోహపాత్రను భద్రపరుస్తారు. కాగా, ఆరుద్ర దర్శనం పర్వదినం సందర్భంగా నటరాజస్వామివారికి పూజలు నిర్వహించే సమయంలో లోహ పాత్రకు కూడా పూజలు చేస్తారు.

### దర్గాలో కార్తీక దీపాల శోభ



పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అవినాశి సమీపంలో మతసామరస్యం చాటేలా, దర్గాలో కార్తీక దీప పూజలు నిర్వహించారు. తిరుప్పూర్ జిల్లా అవినాశి సమీపం కస్బాకానూరులో పురాతనమైన దగ్ని సున్నత్ జమాత్ మసీదు మహ్మద్ షా వలియుల్లా దర్గా ఉంది. ఈదర్గాలో ప్రతి ఏడాది గంధోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. అలాగే, మతసామరస్యం చాటడం, సోదరభావం పెంపొందించుకునేలా, కార్తీక దీపోత్సవం సందర్భంగా ఆ ప్రాంత ప్రజలు మూడునుంచి ఏడురోజులు దీపాలు వెలిగించి పూజలుచేస్తుంటారు. ఈ విషయమై దర్గా హజ్రత్ షంషుద్దీన్ మాట్లాడుతూ.. తమ కోరికలు నెరవేరాయని కులం, మతం, జాతి సంబంధం లేకుండా అన్నివర్గాల ప్రజలు దర్గాకు వచ్చి పూజలు చేస్తుంటారన్నారు. కార్తీక దీపోత్సవం సందర్భంగా ఈ ప్రాంత ప్రజలు దర్గాలో కార్తీక దీపాలు వెలిగిస్తుంటారని తెలిపారు. అందువల్ల ఈదర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలించిందని షంషుద్దీన్ తెలిపారు.

### పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం

● మంత్రి నాజర్



పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న మంత్రి నాజర్, కలెక్టర్ ప్రతాప్

తిరువళ్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో అస్తవ్యస్తంగా తయారైన రోడ్లు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి నాజర్ పేర్కొన్నారు. తిరువళ్లూరు జిల్లా ఆవడి కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 300 మంది పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు అందించే కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా మంత్రి నాజర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వీధులు, రోడ్లు శుభ్రంగా ఉంచేందుకు కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ప్రజలు, హోటళ్లు, దుకాణాల యజమానులు కూడా చెత్త, వ్యర్థాలను రోడ్ల పక్కన వేయరాదని, తమ ఇళ్ల వద్దకే వచ్చే పారిశుధ్య కార్మికులకు అందజేయాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో భాగంగా, కార్పొరేషన్‌లో పరిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మంత్రి నాజర్, పాలు, బియ్యం, కందిపప్పు, నూనెతో కూడిన ప్యాకెట్లను మంత్రి అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ ఉదయకుమార్, కమిషనర్ శరణ్య, డిప్యూటీ మేయర్ సూర్యకుమార్, డిప్యూటీ కమిషనర్ మారి చెల్వి, ప్రజా ప్రతినిధులు, డీఎంకే నాయకులు పాల్గొన్నారు.

### సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తికి ఘనస్వాగతం



మాజీ జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

వేలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ గురువారం ఉదయం వేలూరులోని నరువి ఆస్పత్రిని సందర్శించారు. ఈ నేపథ్యంలో, ఆయనకు నరువి ఆస్పత్రి అధ్యక్షుడు సంపత్‌కుమార్ పుష్పగుచ్ఛాన్ని అందించి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆస్పత్రి సిబ్బంది న్యాయమూర్తికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఉపాధ్యరాలు అనిత, జనరల్ మేనేజర్ నితిన్, అభిరామి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### పీఎంకే అంతర్గత వ్యవహారాల్లో ఈసీ జోక్యం చేసుకునే వీలులేదు: ఢిల్లీ హైకోర్టు

చెన్నై, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీగా అంగీకారం పొందని పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) అంతర్గత వ్యవహారాల్లో కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకునేందుకు వీలులేదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఇటీవల అన్బుమణి రాందాస్ నాయకత్వంలో ఉన్న పార్టీయే పీఎంకే అంటూ ఓ లేఖ ద్వారా వర్తమానం పంపింది. ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ వర్గీయులు ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పీఎంకేలో అన్బుమణి రాందాస్‌కు, డాక్టర్ రాందాస్‌కు పార్టీ ఆధిపత్యానికి సంబంధించి ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతోంది. నకిలీ దస్తావేజులు సమర్పించి పార్టీని కబళించారంటూ అన్బుమణిపై ఆరోపణలు చేస్తూ రాందాస్ వర్గీయులు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇరువర్గాల వాద ప్రతివాదనల అనంతరం ఎన్నికల సంఘం తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ అన్బుమణి వర్గీయుల నుంచి తమకు అందిన దరఖాస్తులను పరిశీలించిన మీదటే ఆయన్ని పీఎంకే అధ్యక్షుడిగా గుర్తించినట్లు ప్రకటించిందన్నారు. తమ నిర్ణయం తప్పిదమయితే దానికి సంబంధించిన ఆధారపత్రాలను ప్రత్యర్థి వర్గీయులు దాఖలు చేసిన తమ ద్వారా న్యాయం పొందవచ్చని ఈసీ పేర్కొందన్నారు. అంతే కాకుండా ప్రస్తుతం పీఎంకే రాజకీయ పార్టీగా అంగీకారం పొందలేదని, ఇలా గుర్తింపు లేని రాజకీయ పార్టీ అంతర్గత వ్యవహారాలలో ఎన్నికల సంఘం ఎన్నడూ జోక్యం చేసుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇరువర్గాల మధ్య వివాదాలు అధికమైతే పార్టీ గుర్తును స్తంభింపజేస్తామని కూడా పేర్కొందన్నారు. అన్ని పక్షాల వాద ప్రతివాదనల అనంతరం ఢిల్లీ హైకోర్టు స్పందిస్తూ.. పీఎంకే గుర్తింపులేని పార్టీ అని, ఇలా ఈసీ అంగీకారం పొందని పార్టీ అంతర్గత వ్యవహారాలలో ఎన్నికల సంఘం జోక్యం చేసుకోదన్న వాదనతో ఏకీభవిస్తున్నట్లు ప్రకటించింది. అంతే కాకుండా పార్టీపై ఆధిపత్యం ఎవరిదన్న విషయమై రాందాస్ వర్గీయులు సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసి న్యాయం పొందవచ్చునని సూచించింది. రాందాస్ వర్గీయులు దాఖలు చేసిన పిటిషన్‌కు ముక్తాయింపు పలికింది. పార్టీకి సంబంధించి సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసి న్యాయం పొందవచ్చునని రాందాస్ వర్గీయులకు హితవు పలికింది. దీనితో ఢిల్లీలో తిష్టవేసిన రాందాస్ వర్గీయులు గురువారం మధ్యాహ్నం అన్బుమణికి వ్యతిరేకంగా, ఈసీ తీరును తీవ్రంగా ఖండిస్తూ ధర్నా నిర్వహించారు.

### భారతీయార్ వర్శిటీ మాజీ రిజిస్ట్రార్ డిస్మిస్





రూపా గుణశీలన్

ప్యారీస్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారతీయార్ వర్శిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రూపా గుణశీలన్‌ను డిస్మిస్ చేసినట్లు ఆ వర్శిటీ రిజిస్ట్రార్ రాజవేల్ గురువారం ప్రకటించారు. కోవై యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసిన రూపా గుణశీలన్ భారతీయార్ వర్శిటీ రిజిస్ట్రార్‌గా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఆమె పదవిలో కొనసాగిన రోజుల్లో నిబంధనలు అతిక్రమించారని, వర్శిటీ స్టాండింగ్ కమిటీ, సిండికేట్ అనుమతిలేకుండా పనులుచేపట్టి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆమెపై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో, ఆవర్శిటీ కొత్త రిజిస్ట్రార్‌గా గత ఆగస్టులో పదవీబాధ్యతలు స్వీకరించిన డా.రాజ్‌వేల్, రూపా గుణశీలన్‌కు సంబంధించిన ఫిర్యాదులను విశ్వవిద్యాలయాల సంచాలకులు, రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి దృష్టికి తీసుకెళ్లారు. దీనిని పరిశీలించిన గవర్నర్ విచారణ బాధ్యతలను తమిళనాడు ఓపెన్ వర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ పార్థసారథికి అప్పగించారు. ఆయన విచారణజరిపి సమర్పించిన నివేదికను పరిశీలించిన రాజవేల్, రూపా గుణశీలన్‌ను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు ప్రకటించారు.

### ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



ఎయిడ్స్ నిర్మూలన స్టిక్కర్లను ఆటోకు అంటిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేలూరు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు వేలూరు ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రి ప్రిన్సిపల్ రోహిణిదేవి, జిల్లా ఆరోగ్యశాఖ అధికారి భరణిధరన్‌లు పాల్గొన్నారు. కళాశాల సిబ్బంది ఎయిడ్స్ నిర్మూలనపై ప్లకార్డులు పట్టుకుని నగరవీధుల్లో ప్రజలకు అవగాహన కల్పించేలా ర్యాలీలో పాల్గొన్నారు. కాగా, కలెక్టర్ ఎయిడ్స్ గురించి రూపొందిన స్టిక్కర్లను వాహనాలపై అంటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వవైద్యులు, నర్సులు సహా పలుశాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 8న కంచి ఏకాంబరేశ్వరాలయ మహాకుంభాభిషేకం

### నేత్రపర్వంగా పవిత్ర జల కలశాల ఊరేగింపు

ప్యారీస్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆలయాల నగరంగా ప్రసిద్ధి చెందిన కాంచీపురంలో పురాతన ఏకాంబరేశ్వరనాథర్ ఆలయ మహాకుంభాభిషేకం ఈ నెల 8న నిర్వహించేందుకు ఆలయ యాజమాన్యం భారీ ఏర్పాట్లు సిద్ధం చేశారు. 12యేళ్ల అనంతరం నిర్వహించదలచిన కుంభాభిషేకం కోసం దేశంలో ప్రవహిస్తున్న పలు పుణ్యనదుల నుంచి సేకరించిన పవిత్ర జల కలశాలను గురువారం ఉదయం నేత్రపర్వంగా ఊరేగించారు. పంచభూత స్థలాల్లో ఒకటిగా, పలు శతాబ్దాలుగా నిత్యపూజలందుకుంటున్న కంచి ఏకాంబరేశ్వరనాథర్‌ను దర్శనం చేసుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా ప్రతిరోజు ఆలయానికి తరలివస్తుంటారు. మహాకుంభాభిషేకం నిమిత్తం ఈ ఆలయంలో చేపట్టిన జీర్ణోద్ధరణ పనులు పూర్తైన నేపథ్యంలో, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాల నుంచి నిర్వాహకులు పవిత్ర జల కలశాలతో పండితుల వేదమంతోచ్చారణ, భక్తుల దివ్యనామస్మరణ, మేళతాళాల మధ్య ఊరేగింపు నిర్వహించారు.



కంచి ఏకాంబరేశ్వరాలయం

### చదువుతోపాటు క్రీడలు అవసరం

● ఆవడి పోలీసు కమిషనర్ శంకర్



విద్యార్థులతో కమిషనర్ శంకర్

తిరువళ్లూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని ఆవడి పోలీసు కమిషనర్ కె.శంకర్ సూచించారు. తిరువళ్లూర్ జిల్లా ఆవడి పోలీసు కమిషనరేట్‌లోని టి7 ట్యాంక్ ఫ్యాక్టరీ పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన బాలబాలికలు ఫోరం నూతన భవనాన్ని కమిషనర్ ప్రారంభించారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీ అనుబంధ సంస్థ హోప్ ఫౌండేషన్ సహాయంతో నిర్మితమైన ఈ భవనంలో కింది అంతస్తులో గ్రంథాలయం, మొదటి అంతస్తులో క్రీడా పరికరాలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఖాళీసమయాల్లో సెల్‌ఫోన్, టీవీలు చూడడం తగ్గించి క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. క్రీడలతో ఆరోగ్యం, ఏకాగ్రత పెరిగి చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉంటారని, క్రీడా సర్టిఫికెట్ల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ ప్రాధాన్యత లభిస్తుందని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ఆవడి డిప్యూటీ కమిషనర్ ఫిరోజ్‌ఖాన్ అబ్దుల్లా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ జీకేష కృష్ణ, జాతీయ హాకీ క్రీడాకారిణి ఇసాబెల్లా, హోప్ ఫౌండేషన్ రీజినల్ డైరెక్టర్ మలర్‌విళి ప్రభాత్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### రాస్తారోకో చేపట్టిన ప్రభుత్వ ఉద్యోగుల అరెస్ట్



ప్రభుత్వ ఉద్యోగులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ పించన్ విధానం అమలు, ఖాళీ పోస్టుల భర్తీ సహా పలు డిమాండ్లతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గురువారం ఆందోళనలు చేపట్టింది. తిరుప్పూర్ కలెక్టర్ కార్యాలయ సమీపంలో ఆందోళన చేపట్టిన ప్రభుత్వ ఉద్యోగులు, ఒక్కసారిగా రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈకారణంగా ఆ మార్గంగా ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. సంఘ నాయకులతో పోలీసు అధికారులు చర్చలు జరిపినా వారు అక్కడి నుంచి వెళ్లలేదు. ఈ కారణంగా, రాస్తారోకోలో పాల్గొన్న సుమారు 100 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించని పక్షంలో, జనవరిలో నిరవధిక సమ్మె చేపడతామని నాయకులు హెచ్చరించారు.

### ఇళ్లలో చేరిన 1,127 పాముల పట్టివేత

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఇళ్లలో ప్రవేశించిన 1,127 పాములను అగ్నిమాపక శాఖ సిబ్బంది బంధించారు. కొద్ది రోజులుగా తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో భారీవర్షం కురుస్తోంది. చెన్నై సహా పలు జిల్లాల్లో రోడ్లపై వర్షపు నీరు ప్రవహించి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షపు నీటిలో చిక్కుకున్న పాములు సమీపంలోని ఇళ్లలోకి ప్రవేశించాయి. ఈ విషయమై ప్రజలు, అత్యవసర పోలీసు నెంబరు 100, 101 ద్వారా స్థానిక ఎగ్మూర్‌లోని రాష్ట్ర డీజీపీ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. ఈ సమాచారాన్ని అగ్నిమాపక శాఖకు పోలీసులు అందజేశారు. గత నెల 29 నుంచి బుధవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లలో ప్రవేశించిన 1,127 పాములను బంధించిన అగ్నిమాపక సిబ్బంది, వాటిని అటవీ శాఖ అధికారులకు అప్పగించినట్లు అగ్నిమాపక శాఖ తెలిపింది.

### తండయార్‌పేట, అన్నానగర్ జోన్లలో పారిశుధ్య పనుల ఒప్పందం రద్దు

● జీసీసీ ప్రకటన

ప్యారీస్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక తండయార్‌పేట, అన్నానగర్ జోన్లలో పారిశుధ్య పనుల నిర్వహణకు సంబంధించి ప్రైవేటు సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దుచేసినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) గురువారం ప్రకటించింది. జీసీసీ తరుపున బహుళ అంతస్తులు, వాణిజ్య భవనాలు, అపార్ట్‌మెంట్లు, శ్మశానవాటికలు, పార్కులు, ప్లేగ్రౌండ్లు అధికంగా ఉండే ఉత్తర చెన్నైలోని తండయార్‌పేట, సెంట్రల్ చెన్నైలోని అన్నానగర్ జోన్లలో పారిశుధ్య పనుల నిర్వహణకు సంబంధించి గత నెల 28వ తేదీన ఓ ప్రైవేటు సంస్థతో నాలుగు ఒప్పందాలు కుదిరాయి. ఈ నేపథ్యంలో, పలు కారణాల వల్ల ఈ ఒప్పందాలను రద్దుచేస్తున్నట్లు జీసీసీ అధికారపూర్వకంగా ప్రకటించింది.

### దివ్యాంగులకు ఎలక్ట్రిక్ వాహనాల పంపిణీ



కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి తదితరులు

వేలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో వేలూరులోని వీఐటీ ప్రాంగణంలో గురువారం ఉదయం 341 మంది దివ్యాంగులకు రూ.1.41కోట్ల విలువైన సంక్షేమ సహాయాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కార్తికేయన్, అమ్ములు, జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ చేతులమీదుగా సుమారు 100 మంది దివ్యాంగులకు ఒక్కొక్కరికి రూ.1లక్షా 1,800 విలువైన ఎలక్ట్రిక్ వాహనాలు, రూ.5,592 విలువైన కుట్టుమిషన్లు, ఐదుగురికి రూ.5లక్షల 25వేల విలువైన బ్యాటరీతో నడిచే వీల్‌చైర్లను పంపిణీ చేశారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైద్యులు, సమాజ సేవకులకు ప్రశంసాపత్రాలు అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేలూరు కార్పొరేషన్ మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, డీఎంకే మండల అధ్యక్షురాలు పుష్పలత, జిల్లా దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారి బాబు సహా పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### మద్యం బార్లలోనూ ఆకస్మిక తనిఖీలు

● టాస్మాక్ సంస్థకు హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలతో పాటు బార్లలో కూడా చట్టవిరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నారా? అంటూ ఆకస్మిక తనిఖీలు చేపట్టాలంటూ టాస్మాక్ సంస్థకు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. స్థానిక సెంబియం ప్రాంతానికి చెందిన జి.దేవరాజన్ మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో.. ఓట్టేరి ప్రాంతంలోని టాస్మాక్ దుకాణం పక్కనే ఉన్న బార్‌లో చట్టవిరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నారని, అనుమతించిన సమయం 10 గంటల తర్వాత కూడా విక్రయిస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ, జస్టిస్ జి.అరుళ్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించి... టాస్మాక్ మద్యం దుకాణాల సమీపంలోని బార్లలో చట్టవిరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నారా? అనే విషయమై టాస్మాక్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఉత్తర్వులు జారీచేసి, కేసు విచారణ ముగిసినట్లు ప్రకటించారు.

### సీఎం బీమా పథకంలో చికిత్సలకు నిరాకరిస్తే ఫిర్యాదు చేయండి

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి బీమా పథకంలో, ప్రైవేటు ఆసుపత్రులు చికిత్సలు అందించేందుకు నిరాకరిస్తే, 104 అనే వైద్య సేవా కేంద్రానికి ఫిర్యాదు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. నగరంలో గురువారం మంత్రి విలేఖరులతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి బీమా పథకంలో ప్రైవేటు ఆసుపత్రులు చికిత్సలు అందించేందుకు నిరాకరిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ప్రతి సోమవారం ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో వారపు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. చికిత్సలు అందించేందుకు నిరాకరించే ప్రైవేటు ఆసుపత్రులపై తగిన చర్యలు చేపడతామని మంత్రి హెచ్చరించారు.



శరవణన్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న తోట తరణి, విశాల్, వైగో నివాళి , వైరముత్తు , కరుణాస్, పి.వాసు, నల్లి కుప్పుస్వామి శెట్టి, ప్రేమలత, సుధీష్ నివాళులు, పేరరసు, ఆర్‌వీ ఉదయకుమార్

ఏవీఎం శరవణన్ అంతిమయాత్ర



శరవణన్ (ఫైల్ ఫొటో)

# లెజండరీ నిర్మాతకు కోలీవుడ్ కన్నీటి వీడ్కోలు

వృద్ధాప్యం కారణంగా భౌతికంగా దూరమైన లెజండరీ సినీ నిర్మాత ఏవీఎం శరవణన్ (86)కు తమిళ చిత్రపరిశ్రమ అశ్రునివాళి అర్పించింది. గురువారం ఉదయం ఆయన తుదిశ్వాస విడువగా, భౌతికకాయాన్ని స్థానిక సాలిగ్రామంలోని ఏవీఎం స్టూడియోలో సినీ రాజకీయ ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం ఉంచారు. శరవణన్ మృతివార్త తెలియగానే ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వచ్చి నివాళులు అర్పించారు. ఆయన వెంట ఆరోగ్య మంత్రి ఎం.సుబ్రమణ్యం కూడా ఉన్నారు. ఆ తర్వాత సినీ, రాజకీయ ప్రముఖులు ఒక్కొక్కరుగా వచ్చి శరవణన్ పార్థివదేహానికి నివాళులు అర్పించారు.

- అడయార్, ఆంధ్రజ్యోతి

## నా కష్టకాలంలో అండగా ఉన్నారు : రజనీకాంత్

తన కష్టకాలంలో ఏవీఎం శరవణన్ అండగా ఉన్నారని సూపర్‌స్టార్ రజనీకాంత్ అన్నారు. ఏవీఎం శరవణన్ భౌతికకాయానికి నివాళులు అర్పించిన తర్వాత ఆయన మాట్లాడుతూ.. 'నిర్మాత శరవణన్ ఎంతో గొప్పవ్యక్తి. సినిమాను ప్రాణంగా ప్రేమించినవారు. నా కష్టకాలంలో నాకు అండగా నిలిచారు. దుస్తుల్లోనూ, ఆహార్యంలోనూ స్వచ్ఛమైన వ్యక్తి. నన్ను ఎంతగానే అభిమానించేవారు. ఎల్లవేళలా నా శ్రేయస్సును కోరుకున్నారు. ఏవీఎం నిర్మాణ సంస్థలో నేను 9 సినిమాల్లో నటించాను. అవన్నీ హిట్ చిత్రాలే. వాటిలో శివాజీని ఎంతో గ్రాండ్‌గా తీశారు. మరో చిత్రం చేయాలని అనుకున్నాం. ఇంతలోనే జరగరానిది జరిగిపోయింది. ఆయన ఇక లేరన్న వార్త ఎంతగానో బాధిస్తోంది. ఆయన ఆత్మకు శాంతి కలగాలి' అని అన్నారు.



## ఏవీఎం తోటలో చిన్న మొక్కను : కమల్ హాసన్

తనకు ఏవీఎం శరవణన్ తండ్రి సమానులని అగ్ర నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ అన్నారు. ఏవీఎం శరవణన్ మృతిపట్ల తన ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలుపుతూ కమల్ హాసన్ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. 'ఏవీఎం అనే మహావృక్షం ఉన్న తోటలో నేను ఒక మొక్కగా పెరిగాను. తన సోదరులు చంద్రహాసన్, చారుహాసన్‌లకు తండ్రి స్థానం ఇచ్చినట్లే, శరవణన్‌కు కూడా అదే స్థానం ఇచ్చాను. అలాంటి వ్యక్తి ఇపుడు భౌతికంగా దూరం కావడం జీర్ణించుకోలేకపోతున్నాను. ఎంతోమందికి సినిమా అవకాశాలు, ఎన్నో విజయవంతమైన చిత్రాలు ఇచ్చిన శరవణన్ తరహాలోనే ఆయన తర్వాతి తరం కూడా కొత్త మొక్కలకు అవకాశం ఇవ్వడమే గొప్ప నివాళి' అని పేర్కొన్నారు.

## క్యూకట్టిన సినీ ప్రముఖులు

శరవణన్ భౌతికకాయం ఉంచిన ఏవీఎం స్టూడియోకు సినీ ప్రముఖులు క్యూ కట్టారు. తమ అభిమాన నిర్మాతను కడసారి చూసేందుకు వారంతా తరలివచ్చి నివాళులు అర్పించారు. వీరిలో నిర్మాతలు మురళి రామన్, విజయ్ టైమ్ రామ్మూర్తి, విజయ ప్రొడక్షన్ విశ్వనాథ రెడ్డి కేటీ కుంజుమోన్, స్వరూప్ రెడ్డి, మురళి రామస్వామి, సౌందరపాండియ్, పుష్పా కుప్పుస్వామి, అమృతం, కొట్టక్కర ప్రసాద్, రాజశేఖర్ పాండియన్, సక్సేనా, కలైపులి ఎస్.థాను, కె.కరుణమూర్తి, దర్శకులు వీసీ గుహనాథన్, రాజా, వసంత్ సాయి, జయేంద్ర, ఎస్పీ ముత్తురామన్, పి.వాసు, కె.భాగ్యరాజ్, రామ్‌కుమార్, మోహన్ రాజా, అరివళగన్, ఈవీ గణేష్ బాబు, ఆర్‌వీ ఉదయకుమార్, పేరరసు, ఎళిల్, లింగుస్వామి, రాజీవ్ మేనన్, ఎస్.ఏ.చంద్రశేఖర్, మణిరత్నం, శంకర్, రాజాకుమరన్, కదిర్, ఆర్.పాండియరాజన్, నటీనటులు మోహన్ రామన్, పిరమిడ్ నటరాజన్, పూమాలై మోహన్, విశాల్, ఈశ్వరీ రావు, ఆర్.పార్తిబన్, విక్రమ్ ప్రభు, చిన్న జయంతి, కరుణాకరన్, సూర్య, శివకుమార్, కేఆర్ విజయ, రజనీకాంత్, నాజర్, ఆనంద్ రాజ్, జీవా, ఇళవరసు, విజయకుమార్, అరుణ్ విజయ్, సుబ్బు పంచు, రాజకీయ నేతల్లో వైగో, ధనశేఖరన్, ప్రభాకరన్, డి.జయకుమార్, సీమాన్, కనిమొళి, కె.వీరమణి, ప్రేమలత విజయకుమార్, ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ భారత్ రామన్, ఐపీఎస్ అధికారిణి శివనంది, వ్యాపారవేత్తలు నల్లి కుప్పుస్వామి శెట్టి, శ్రీకృష్ణ స్వీట్స్ మురళి, వీజీపీ గ్రూపు సంతోషం తదితరులు ఉన్నారు.



అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్, సీమాన్, మణిరత్నం, ఏవీఎం శరవణన్ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎస్ఏ చంద్రశేఖర్

## శివకుమార్ - సూర్య భావోద్వేగం



ఏవీఎం శరవణన్ భౌతికకాయానికి నివాళులు అర్పించేందుకు వచ్చిన సీనియర్ నటుడు శివకుమార్, ఆయన కుమారుడు, హీరో సూర్య తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు. సూర్య హీరోగా ఏవీఎం సంస్థ రెండు చిత్రాలను నిర్మించిన విషయం తెల్సిందే.

## తమిళ సినిమా మార్గాన్ని నిర్దేశించిన వ్యక్తి : సీఎం స్టాలిన్

ప్రముఖ సినీ నిర్మాత ఏవీఎం శరవణన్ మృతి పట్ల ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన ప్రగాఢ సంతాపం తెలిపారు. తమిళ చిత్రపరిశ్రమ మార్గాన్ని నిర్దేశించిన వ్యక్తిగా అభివర్ణించారు. ఇదే విషయంపై సీఎం స్టాలిన్ తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'తమిళ చిత్రపరిశ్రమలోని గొప్ప వ్యక్తుల్లో ఒకరు. ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ ఏవీఎం ప్రొడక్షన్‌కు ప్రతిరూపం ఏవీఎం శరవణన్. ఆయన మరణవార్త విని ఎంతగానో బాధపడ్డాను. తమిళ సినిమా మార్గాన్ని నిర్ణయించడంలో ఏవీఎం ఎంతటి పాత్ర పోషించిందో అదే విధంగా ఏవీఎం శరవణన్ కూడా ముఖ్య పాత్రను పోషించారు. అప్పాచ్చి అని ప్రతి ఒక్కరూ ముద్దుగా పిలుచుకునే ఏవీ మెయ్యప్పన్‌కు మరింతగా గౌరవం చేకూర్చిన వ్యక్తి. అన్నాదురై 'ఓర్ ఇరవు', కలైంజర్ 'పరాశక్తి', మురసొలి మారన్ 'కుల దైవం' చిత్రాలు ఏవీఎం నిర్మాణ సంస్థకు ఎంతటి పేరు ప్రఖ్యాతలు తెచ్చాయో, అంతేస్థాయిలో ద్రావిడ చిత్రపరిశ్రమతో సుదీర్ఘమైన అనుబంధం ఉంది. ఆ బంధమే ఒక కుటుంబంగా కలిపి, మా కుటుంబానికి బాగా దగ్గరయ్యారు. 2023లో ఏవీఎం హెరిటేజ్ మ్యూజియంను సందర్శించినపుడు నాతో ఎన్నో జ్ఞాపకాలను పంచుకున్నారు. ఆప్యాయంగా ముచ్చటించారు. ప్రశాంతమైన, సరళమైన వ్యక్తిత్వాన్ని కలిగిన ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిన ఏవీఎం కుటుంబ సభ్యులకు, సినీ పరిశ్రమలోని స్నేహితులకు నా ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలియజేస్తున్నాను. అలాగే, మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి, ద్రావిడ కళగం నేత కె.వీరమణి, నడిగర్ సంఘం, రజనీకాంత్, విశాల్, సూర్య, పార్తిబన్, తమిళ సినీ నిర్మాతల సంఘం ఇలా తమిళ సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు.

## తండ్రిగా మార్గనిర్దేశం చేశారు..

ఏవీఎం శరవణన్ మృతిపట్ల ఇండియా హౌజ్ అసోసియేషన్ అధ్యక్షుడు అబూబాకర్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత 46 యేళ్ళుగా తన తండ్రిగా మార్గనిర్దేశం చేశారని గుర్తు చేశారు. కన్నతండ్రి 26 యేళ్ళు మాత్రమే ఉన్నారు. ఆ తర్వాత ఆయన విదేశాలకు వెళ్ళారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఒక తండ్రిగా తనకు దిశానిర్దేశం చేసి జీవిత పాఠాలను నేర్పించారని ఆయన గుర్తు చేశారు. అలాగే, పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు శరవణన్ మృతిపట్ల తమ సంతాపాలను సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

### సినిమా షూటింగులు రద్దు

ఏవీఎం శరవణన్ మృతికి సంతాప సూచకంగా నగరంలో గురువారం జరగాల్సిన అన్ని సినిమా షూటింగులను రద్దు చేశారు. అలాగే, పలు సినిమా కార్యక్రమాలు, ఆడియో రిలీజ్ వేడుకలను కూడా రద్దు చేశారు.

### ఎంజీఆర్‌తో కలిసి భోజనం

ఎంజీఆర్ హీరోగా ఏవీఎం నిర్మాణ సంస్థ 'అన్బేవా' అనే చిత్రాన్ని నిర్మించింది. ఆ చిత్రం షూటింగ్ సమయంలో ఓ ఆసక్తికర సంఘటన జరిగింది. ఈ విషయాన్ని ఏవీఎం శరవణన్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. త్వరగా సినిమా షూటింగ్‌ను పూర్తి చేసి సిమ్లాకు వెళ్ళాల్సి ఉంది. దీంతో మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళితే ఆలస్యం అవుతుందని భావించిన ఎంజీఆర్.. లొకేషన్‌కు భోజనం తెప్పించారు. ఈ రోజున ఆయన పక్కన కూర్చొని భోజనం చేసేంత వరకు వదిలిపెట్టలేదు. ఆ తర్వాత ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత చిత్రపరిశ్రమకు చెందిన ప్రముఖులను ఇంటికి ఆహ్వానించారు. అలా వెళ్లిన వారంతా మాంసాహారం భోజనం చేశారు. నేను ఒక్కడినే శాఖాహారిని. ఈ విషయం ఎంజీఆర్‌కు తెలుసు. అందుకే నన్ను మాత్రం ప్రత్యేకంగా ఒక గదిలో కూర్చోబెట్టి భోజనం పెట్టారు. అంత గొప్ప మనస్సున వ్యక్తి ఎంజీఆర్ అని చెప్పారు.

### ఎన్న ముదలాలి ఇప్పడి ఆగివిట్టదు...

'సాధారణంగా సినిమా షూటింగ్‌లో తొలి షాట్ ఎంజీఆర్‌పై తీసే ఆనవాయితీ ఉంది. ఒక రోజున సరోజా దేవి అర్జెంటుగా వెళ్లాల్సి ఉండటంతో తొలి షాట్‌ను ఆమెపై దర్శకుడు త్రిలోక్ చంద్ తీశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంజీఆర్ అలిగి తన గదికి వెళ్లిపోయారు. కొంత సమయం తర్వాత ఆయనే బయటకు వచ్చి.. 'ఎన్న మొదలాలి' ఇదు ఇప్పడి ఆగివిట్టదు' అంటూ కల్పించుకుని మాట్లాడారని శరవణన్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

### వైట్ అండ్ వైట్ ఆయన ట్రేడ్ మార్క్

ఏవీఎం శరవణన్ ఎల్లవేళలా తెల్లటి దుస్తులే ధరించేవారు. ఆ దుస్తులు ఆయన ట్రేడ్‌మార్క్‌గా అభివర్ణించేవారు.ఆ దుస్తులు ఎంత తెల్లగా ఉంటా యో... ఆయన మనసు కూడా అంతే స్వచ్ఛంగా ఉంటుందని పలువురు సినీ ప్రముఖులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ఉచిత బస్సులు



విద్యార్థులకు ఉచిత బస్సులు ప్రారంభిస్తున్న మంత్రులు అన్బిల్ మహేష్, శివశంకర్

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సులు నడుపుతున్నట్లు రవాణా శాఖ మంత్రి శివశంకర్ తెలిపారు.పాఠశాలలకు వెళ్లే సమయం, ముగించుకుని వచ్చే సమయంలో తగినన్ని బస్సులు నడపకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అదే సమయంలో, ఆ బస్సుల్లో రద్దీ అధికంగా ఉండడంతో, విద్యార్థులు ఫుట్ బోర్డులపై ప్రయాణిస్తూ కాలు జారిపడి మృతిచెందిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు రాజధాని నగరం చెన్నైలోని పలు మార్గాల్లో విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశారు. ఆ క్రమంలో, తిరుచ్చి తిరువెరుంబూర్‌లోని నాలుగు మార్గాల్లో పాఠశాల విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన ఉచిత బస్సులను గురువారం పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్, రవాణా శాఖ మంత్రి శివశంకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శివశంకర్ మాట్లాడుతూ... చెన్నైలో మాత్రమే పాఠశాల విద్యార్థులకు ఉచిత బస్సులు నడుపుతుండగా, గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన మార్గాల్లో విద్యార్థులకు ఉచిత బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.

## ప్రేమపెళ్లి బహుకష్టం



● వివాహ వేడుకలో డిప్యూటీ సీఎం ఉదయనిధి

ప్యారీస్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకోవడం బహుకష్టమని ఓ వివాహ వేడుకలో డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యానించి నవ్వులు పూయించారు. విరుదునగర్ జిల్లా శివకాశి కార్పొరేషన్ మేయర్ సంగీత ఇంట గురువారం ఉదయం జరిగిన వివాహ కార్యక్రమంలో ఉదయనిధి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సభనుద్దేశించి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగు రోజులుగా భారీవర్షం కురుస్తున్న నేపథ్యంలో కూడా తప్పని పరిస్థితుల్లో ఈ వివాహ వేడుకల్లో పాల్గొన్నట్లు చెప్పారు. వధూవరులు ప్రేమికులని తెలిసిందని, ప్రేమించిన వ్యక్తిని మనువాడటం మహా కష్టమని, అయితే పిల్లలను అర్థం చేసుకునే తల్లిదండ్రులు వుంటే ప్రేమ జంట జీవితం సాఫీగా సాగుతుందని తెలిపారు. కాగా, ఉదయనిధి తన సతీమణి కార్తికను ప్రేమించి పెళ్లిచేసుకున్న విషయం తెలిసిందే.

## వైభవంగా దత్తాత్రేయ జయంతి

ప్యారీస్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడ్‌వే ఆచారప్ప వీధిలో జై వాసవి సాయి ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలోని అక్షయ సాయిబాబా మందిరంలో దత్తాత్రేయ జయంతి మహోత్సవాన్ని మార్గశిర పౌర్ణమి శుభదినమైన గురువారం వైభవంగా జరుపుకున్నారు. ఉదయం 8.30 నుంచి 10.30 గంటలలోపు విఘ్నేశ్వరపూజ, సంకల్పం, కలశస్థాపన, దత్తాత్రేయ మూలమంత్ర హోమం, విశేషాభిషేకం, అలంకారం, ఉపచారపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల త్రిమూర్తుల అంశంతో అవతరించిన దత్తసాయి వారికి పసుపు పూలు, ఆవు నెయ్యి, పత్రాలు, పండ్లు, సుగంధద్రవ్యాలు, పాయసం నివేదించారు. అనంతరం జీవితంలో సకల శుభాలు కలగాలని కోరుతూ స్వామివారిని అష్టోత్తరాలు, కనకధార స్తోత్రం పఠించి, భక్తిశ్రద్ధలతో గురు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12గంటలకు మధ్యాహ్న హారతి, సత్యనారాయణ స్వామి పూజలో మహిళలు పాల్గొని పారాయణం గావించి స్వామివారిని స్తుతించారు. సాయి, దత్త నామస్మరణలతో వేదిక ప్రాంగణాలు మారుమోగాయి. దత్త జయంతిని పురస్కరించుకుని సాయినాథుని పాలరాతి విగ్రహాన్ని రకరకాల పూలు, పత్రాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయ మేనేజింగ్ ట్రస్టీ అజంతా డా.కనిగెలుపుల శంకరరావు, కేంద్రప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది స్వర్ణలతలు భక్తులకు తీర్థ అన్నప్రసాదాలు, ముత్తయిదువలకు పసుపు కుంకుమలు పంపిణీ చేశారు.



దత్తాత్రేయ అష్టోత్తర పూజలో అజంతా శంకరరావు, నిర్వాహకులు

## తెన్‌కాశిలో న్యాయవాదుల రాస్తారోకో



తెన్‌కాశి నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

చెన్నై, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశిలో ప్రభుత్వ ప్రాసిక్యూటర్ ముత్తుకుమారసామి దారుణహత్యను ఖండిస్తూ లాయర్లు కోర్టు విధులను బహిష్కరించి గురువారం ఉదయం రాస్తారోకో నిర్వహించారు. తెన్‌కాశి నగరం ఊర్‌మేల్ అళగి ప్రాంతం వద్ద బుధవారం ఉదయం 10.30 గంటలకు ముత్తుకుమారసామి కార్యాలయంలో గుర్తు తెలియని వ్యక్తి చొరబడి వేటకొడవళితో దాడి జరిపి హతమార్చి మెరుపువేగంతో పారిపోయాడు. ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా తీవ్ర సంచలనం కలిగించింది. పభుత్వ ప్రాసిక్యూటర్ ముత్తుకుమారసామి పలు ఆస్తి వివాదాల కేసులలో హాజరయ్యేవారని, ఆ నేపథ్యంలో ఆస్తి తగాదాకు సంబంధించి కక్షిదారుడెవరైనా కక్షగట్టి ఈ హత్య చేయించి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ సంఘటనను ఖండిస్తూ తెన్‌కాశి నగరంలో గురువారం ఉదయం సుమారు వందమంది న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి రాస్తారోకో జరిపారు. హత్యకు గురైన ప్రాసిక్యుటర్ కుటుంబీకులకు రూ.1కోటిని నష్టపరిహారంగా చెల్లించాలని, హంతకుడిని గుండా చట్టం కింద అరెస్టు చేయాలని న్యాయవాదులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

## పూండి జలాశయం నుంచి అదనపు జలాలు విడుదల



పూండి జలాశయం నుంచి విడుదల చేస్తున్న అదనపు జలాలు

తిరువళ్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను ప్రభావంతో నీటి మట్టం పెరగడంతో పూండి జలాశయం నుంచి 500 ఘనపుటడుగుల మేరకు మిగులు జలాలను విడుదల చేశారు. దిత్వా తుపాను ప్రభావంతో వారం రోజులుగా తిరువళ్లూరు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా, చెన్నైకు తాగునీటిని అందించే పూండి, పూళల్, చెంబరంబాక్కం, చోళవరం, తేర్వాయ్ కండిగై జలాశయాల్లో నీటిమట్టాలు పూర్తి స్థాయికి చేరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో, పూండి జలాశయం పూర్తి సామర్థ్యం 35 అడుగుల కాగా, ప్రస్తుతం నీటి మట్టాలు 34.43 అడుగులకు చేరుకున్నాయి. జలాశయంలోకి 1950 ఘనపుటడుగుల నీరు వస్తుండగా, డ్యాం భద్రకత దృష్ట్యా 500 ఘనపుటడుగుల అదనపు జలాలను దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

## పాలారుకు వరదలు

● జలదిగ్బంధంలో ఆంజనేయస్వామి ఆలయం

చెన్నై, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు సమీపం పొల్లాచ్చి - వాల్పారై రహదారికి చేరువగా ఉన్న షణ్ముఖాపురం పాలారు వాగులో గత ఐదు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు వరదలు సంభవించాయి. పాలారు వాగు ఒడ్డున ఉన్న రెండు శతాబ్దాలనాటి ఆంజనేయ స్వామి ఆలయంలో వరదనీరు చొరబడటంతో భక్తులు ఆ ఆలయానికి వెళ్ళకుండా పోలీసులు ఆంక్షలు విధించారు. ఆలయానికి వెళ్లే రహదారి పూర్తిగా వరదనీటిలో మునిగిపోయింది. దీంతో ఆ ఆలయంలోకి వర్షపునీరు చొరబడింది.

వాల్పారై సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయ రహదారిపై పొంగి ప్రవహిస్తున్న వరద నీరు







తలకోన



మొండోడి కోన



మంగళం



మాలాడిగుండం

# జలపాతాల పరవళ్లు



కపిలతీర్థం

తిరుపతి నగరానికి పచ్చని కిరీటంలా కనిపిస్తుంది తిరుమల కొండ. పాతిక కిలోమీటర్ల దూరం నుంచి కూడా పవళించిన అనంత శేషుడిలా కనిపించే ఈ కొండల బారు రుతువు రుతువుకీ తన అందాలు మార్చుకుంటుంది. ఎండాలకాలం మొక్కలు మోడులై తెల్లని బండలు మెరుస్తూ దర్శనమిస్తుంది. వాన కురిస్తే పరచకుకున్న ఆకుపచ్చదనం కనువిందు చేస్తుంది. ఎడతెగని తుఫాను వానలతో కొండల్లోంచి జాలువారుతున్న వాగులు వంకలతో, దూకుతున్న జలపాతాలతో శేషాచలం సౌందర్యవనంగా మారింది. కరకంబాడి నుంచి తలకోన దాకా కొండబారున ఎటు చూసినా పచ్చని అడవిలోంచి తెల్లని పాలనురగలా జారుతున్న జలపాతాలు కనిపిస్తున్నాయి. ఇవన్నీ తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి ప్రాంతాల నుంచి కనిపించే అందాలే. కొండలు ఎక్కి లోయల్లోకి దిగితే అనేక తీర్థాలు స్వాగతం పలుకుతాయి.



బీటీఆర్ కాలనీ

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, తిరుపతి

## జలపాతాల జీవకోన

తిరుపతి(జీవకోన),(అర్బన్)డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని జీవకోనలో వెలసిన జీవలింగేశ్వరస్వామి జలపాతం కనువిందు చేస్తోంది. ఆలయం ఆనుకుని ఉన్న ఎత్తైన కొండ నుంచి జాలువారుతున్న ఈ జలపాతం లో భక్తులు పెద్ద సంఖ్యలో స్నానాలు చేస్తున్నారు. మంగళంలోని బీటీఆర్ కాలనీకి ఆనుకొని ఉన్న అటవీప్రాంతంలో కూడా కొండల నుంచి వచ్చే నీరు జోరుగా దూకుతున్నాయి. సమీప ప్రజలు ఆ ప్రాంతానికి చేరుకొని స్నానమాచరిస్తున్నారు. ఈ జలధారలు కాస్త దూరం ప్రవహించి ఆ తరువాత మాయమైపోయి, భూ అంతర్భాగంలో ప్రవహిస్తూ కొండకిందన మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇళ్లమధ్య కాలువల్లో దూసుకెళ్తూ చెన్నాయిగుంట చెరువులో కలుస్తోంది. అలాగే జీవలింగేశ్వరస్వామి ఆలయం నుంచి తూర్పు దిక్కున 300మీటర్లు వెళితే మొండోడికోన దర్శనమిస్తుంది. ఈ ప్రాంతం ప్రస్తుతం జల సవ్వడితో సందడి చేస్తోంది. కొండగుట్టల్లో చెట్ల మధ్యలో నుంచి జలపాతం దర్శనమిస్తోంది. స్థానికులు వీటిని సందర్శించి జలకాలాడుతున్నారు. ఆ నీరు దిగువ భవనాల మధ్య నుంచి ప్రవహిస్తూ మంగళం చెరువులోకి చేరుతోంది. లీలామహల్ సర్కిల్ నుంచి కరకంబాడి దాకా ఉత్తరపు దిక్కున కొండల్లోంచి అనేక తావుల్లో పాలధారల్లాంటి జలధారలు కనిపిస్తున్నాయి. వానలు కురిసినపుడు మాత్రమే ఇవి కనిపిస్తుంటాయి.



జీవలింగేశ్వర స్వామి ఆలయం



## ఏర్కాడులో దట్టమైన మంచు

● బోటు సవారీ నిలిపివేత



బోట్ క్లబ్ ప్రాంతంలో కురుస్తున్న మంచు

పెరంబూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం ఏర్కాడులో దట్టమైన మంచు కురుస్తోంది. ఈ కారణంగా బోటు సవారీ తాత్కాలికంగా నిలిపివేశారు. సేలం జిల్లా ఏర్కాడులో వారం రోజులుగా దట్టమైన మంచు కురుస్తోంది. ఉదయం 10 గంటల సమయంలో కూడా మంచు కురుస్తుండడంతో, వాహనచోదకులు హెడ్ లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అదే సమయంలో, మంచుకు తోడు తేలికపాటి జల్లులు కూడా కురుస్తుండడంతో చల్లటి వాతావరణం నెలకొంది. బోటు సవారీ చేసే సరస్సు ప్రాంతంలో దట్టమైన మంచు కురుస్తుండడంతో, సరస్సు పూర్తిగా కనిపించడం లేదు. ఈ కారణంగా, బోటు సవారీని అధికారులు ఉదయం 11 గంటల వరకు రద్దు చేశారు. అనంతరం బోటు సవారీ అనుమతించగా, సాయంత్రం 4 గంటల నుంచి మంచు కరవడం ప్రారంభం కావడం, సరస్సు పూర్తిగా కనిపించకపోవడంతో, మళ్లీ బోటు సవారీని రద్దు చేశారు. దీంతో, సవారీ చేసేందుకు బోట్ క్లబ్‌కు వచ్చిన పర్యాటకులు నిరాశగా వెనుదిరిగారు.

## మాకు న్యాయం చేయండి



ప్రమాదానికి గురైన వాహనంతో బాధితుడి కుటుంబం

తిరుత్తణి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదానికి గురైన తన ఆటోకు నష్టపరిహారాన్ని చెల్లించాలంటూ మహేష్ అనే ఆటోడ్రైవర్ తన కుటుంబంతో కలిసి తిరుత్తణి పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసనకు దిగాడు. వివరాల్లోకి వెళితే.. కొన్నిరోజుల క్రితం తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిరోడ్డులో ఓ ప్రైవేటు బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా పార్కింగ్ చేస్తూ వెనుకనున్న లోడు ఆటోని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటో ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. దీంతో మహేష్‌కు నష్టపరిహారం చెల్లిస్తామని బస్సు యాజమాన్యం తెలిపి అక్కడినుండి వాహనాన్ని తొలగించారు. ఘటన జరిగి నెల రోజులవుతున్నా, తన ఆటోకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో తిరుత్తణి పోలీసులను ఆశ్రయించాడు. ఢీకొన్న బస్సు యజమాని అధికార పార్టీ నాయకుడు కావడంతో పోలీసులు కూడా దీనిపై సరైన రీతిలో స్పందించలేదని సమాచారం. దీనితో గురువారం ఉదయం ఆటోడ్రైవర్ తన కుటుంబంతో కలిసి పోలీస్‌స్టేషన్ ముందు నిరసనకు దిగాడు. ఈ సందర్భంగా అతడు మాట్లాడుతూ, ఘటన జరిగిన రోజు సాయంత్రమే నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పి ఇప్పటివరకు చెల్లించలేదని, ఫైనాన్స్ మీద ఆటో తీసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నానని తెలిపాడు. అధికారులు తమకు న్యాయం చేయాలని, లేకుంటే పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్య చేసుకుంటానని తెలిపాడు.

## ఘనంగా అయ్యప్ప 18 మెట్ల పూజ



ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి

తిరువళ్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్ సమీపంలోని అయ్యప్ప ఆలయంలో గురువారం పడిపూజను ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో ప్రసిద్ధి చెందిన గురుముత్తేశ్వర ఆలయం ఉంది. ఈ ఆలయంలో శివాలయం, సాయిబాబా ఆలయం, అయ్యప్ప దేవాలయాలను సైతం నిర్మించి నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ నిర్వాహకులు, భక్తులు గురువారం 18 మెట్ల పడి పూజ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో భాగంగా అయ్యప్ప స్వామి, గణపతి, శివుడు, పార్వతి, సుబ్రమణ్య స్వామి వార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి, అయ్యప్ప 18 పడి మెట్లపై కర్పూరం వుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో మనవాల నగర్, కడంబత్తూరు, పోలీవాక్కం, మెల్ నల్లాటూర్, కీల్ నల్లాటూర్, వెంగత్తూరు గ్రామాలకు చెందిన అయ్యప్ప, శివ మాల ధరించిన స్వాములు, భక్తులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. భక్తులకు అన్నదానం, ప్రసాదాలను అందజేశారు. గురుస్వాముల బృందం నిర్వహించిన అయ్యప్ప భజన పాటల కచేరి భక్తులను ఆకట్టుకుంది.

10న అన్నాడీఎంకే

# సర్వసభ్య మండలి సమావేశం

● ముమ్మరంగా వేదిక ఏర్పాటు పనులు



స్తంభస్థాపన పూజలో మాజీమంత్రులు బెంజిమెన్, బీవీ రమణ, మాధవరం మూర్తి తదితరులు

ప్యారీస్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే సర్వసభ్య మండలి సమావేశం ఈ నెల 10వ తేదీన జరుగనుంది. ఇందుకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా, ఐదుసార్లు రాష్ట్రముఖ్యమంత్రిగా వ్యవహరించిన రోజుల్లో జయలలిత సారథ్యంలో, పార్టీ సర్వసభ్య మండలి సమావేశం నిర్వహించిన స్థానిక వానగరంలోని శ్రీవారు కల్యాణమండపాన్ని ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఎంపిక చేశారు. గురువారం ఉదయం 10.30 గంటలకు శుభముహూర్తంలో వేదిక ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్తంభస్థాపన ప్రక్రియను పూర్తిచేశారు. వచ్చే 10వ తేదీ ఉదయం 9గంటలకు అన్నాడీఎంకే ప్రిసీడియం ఛైర్మన్ తమిళ్ మగన్‌హుసేన్ అధ్యక్షతన ప్రారంభం కానున్న ఈ సమావేశానికి పార్టీ ప్రధాన నిర్వాహకులు, మాజీమంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు, సర్వసభ్య మండలి సభ్యులను ఆహ్వానించనున్నారు. ఈ సమావేశం ఆమోదించే తీర్మానాలు, పార్టీ భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలపై ఈపీఎస్ ప్రసంగించనున్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఈ సమావేశానికి సంబంధించిన ఆహ్వానపత్రాలను సభ్యులకు పంపించే కార్యక్రమం మొదలుపెట్టింది. స్తంభస్థాపన కార్యక్రమంలో మాజీమంత్రులు బెంజిమెన్, బీవీ రమణ, మాధవరం మూర్తి, ఎస్.అబ్దుల్ రహీం, ప్రిసీడియం కార్యదర్శులు రాయపురం ఆర్.మను, తిరుత్తణి కె.హరి, తిరువేర్కాడు శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం నిర్వహించనున్న ప్రాంగణంలో ప్రత్యేక వేదిక, డైనింగ్ హాలు, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలతో పాటు వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యాలను కల్పించనున్నట్లు అన్నాడీఎంకే నిర్వాహకులు తెలిపారు.

## శ్రీలంక తమిళులకు నిధుల కేటాయింపులో అవినీతి

● మాజీ తహసీల్దార్ సహా ఐదుగురికి జైలు

అడయార్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక తమిళులకు రుణాలు అందించేందుకు కేటాయించిన నిధుల్లో అవినీతి పాల్పడిన మాజీ తహసీల్దార్ సహా ఐదుగురికి కోర్టు జైలు శిక్ష విధించింది. రాష్ట్ర ప్రభుత్వం 1994-96 సంవత్సరాల్లో శివగంగ జిల్లాల్లో శ్రీలంక తమిళులకు ఇళ్లు నిర్మించేందుకు రూ.43.50 లక్షలు కేటాయించింది. ఈ నిధులను 435 మంది శ్రీలంక తమిళులకు అందజేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించి అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదులందాయి. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన శివగంగ జిల్లా అవినీతి నిరోధక శాఖ పోలీసులు, అప్పట్లో దేవకోట ఆర్డీవో సయ్యద్ హుస్సేన్, కారైక్కుడి తహసీల్దార్ సర్దార్, డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహీం, కళనివాసల్ వీఏవో రామచంద్రన్, శివగంగ జిల్లా కలెక్టర్ కార్యాలయ క్లర్క్ ధనశేఖరన్, కాంట్రాక్టర్ కదిరేశన్ శ్రీలంక శరణార్థుల పునరావాస కేంద్రం అధ్యక్షులు ముత్తు అలియాస్ శరవణముత్తు సహా 9 మందిపై కేసు నమోదుచేశారు. ఈ కేసు జిల్లా అవినీతి కేసుల ప్రత్యేక కోర్టులో విచారణ జరుగుతోంది. కేసు విచారణ సమయంలో, సయ్యద్ హుస్సేన్, ఇబ్రహీం, రామచంద్రన్, ధనశేఖరన్ తదితరులు మృతిచెందగా, మిగిలిన వారిపై విచారణ సాగుతోంది. ఈ కేసు విచారణ పూర్తికావడంతో న్యాయమూర్తి అనితా క్రిస్టీ... నేరారోపణలు ఎదుర్కొంటున్న మాజీ తహసీల్దార్ సర్దార్, కాంట్రాక్టర్ కదిరేశన్, శరవణ ముత్తు తదితర ముగ్గురికి తలా మూడేళ్ల జైలుశిక్ష, రూ.30 వేల జరిమానా విధించారు. మిగిలిన ఇద్దరికి తలా రెండేళ్ల జైలుశిక్ష, రూ.15 వేలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు.

## అంధబాలుడి సాహసం



హర్షవర్ధన్‌ను, కోచ్ ప్రతాప్‌ను అభినందిస్తున్న రవినాయుడు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : స్థానిక తీర్థకట్ట వీధికి చెందిన అంధ బాలుడు హర్షవర్ధన్ మరో సాహసానికి సిద్ధమవుతున్నాడు. ఈనెల 8వ తేదీన నాన్‌స్టాప్ 200 కిలోమీటర్ల బ్లైండ్ మల్టీటాస్క్ రోడ్డు స్కేటింగ్ మారథాన్‌లో పాల్గొని ప్రపంచ రికార్డు కోసం ప్రయత్నిస్తున్నాడు.

### రూట్‌మ్యాప్ ఇలా..

రాష్ట్ర సరిహద్దు నంగిలి చెక్‌పోస్టు నుంచి పలమనేరు, చిత్తూరు, తిరుపతి, శ్రీకాళహస్తీమీదుగా పుత్తూరుకు చేరుకుంటారు. వజ్ర, వండర్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డుల ప్రతినిధులు హాజరై రికార్డు చేస్తారు. 9న శ్రీనివాస క్రీడా సముదాయంలో ప్రపంచ రికార్డు పత్రాన్ని అందిస్తారు.

### శాప్ ఛైర్మన్ సహకారం..

హర్షవర్ధన్ గురువారం తన కోచ్ ప్రతాప్‌తో కలిసి శాప్ ఛైర్మన్ రవినాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్కేటింగ్ చేసే రూట్‌మ్యాప్‌ను చూపించి సహాయ సహకారాలు కోరారు. స్పందించిన రవినాయుడు ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని, సమస్యలు తలెత్తకుండా చూడాలని రెండు జిల్లాల డీఎస్‌డీవోలను ఫోన్ ద్వారా ఆదేశించారు. రోడ్డు భద్రత కల్పించాలని పోలీసు విభాగాన్ని కోరి, అవసరమైన అనుమతులు ఇప్పించారు. తనవంతు సాయంగా రూ.10వేలు అందించారు.

## వైభవంగా కార్తీక దీపోత్సవం



గోవిందరాజస్వామి ఆలయంలో కార్తీక దీపాల ఊరేగింపు

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలోని గోవిందరాజస్వామి, కోదండరామస్వామి ఆలయాల్లో గురువారం పౌర్ణమి సందర్భంగా కార్తీక దీపోత్సవం వైభవంగా జరిగింది. కోదండ రామస్వామి ఆలయంలో ఉదయం ఈ దీపోత్సవాన్ని పురస్కరించుకుని అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని పుండరీకవల్లి అమ్మవారి సన్నిధి నుంచి ఆలయ మర్యాదలతో పడి, కార్తీక దీపం, నూతన వస్త్రాలను ఊరేగింపుగా ఇక్కడకు తీసుకొచ్చారు. అనంతరం దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. గోవిందరాజస్వామి ఆలయంలో సాయంత్రం కార్తీక దీపోత్సవం కనుల పండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి వారికి ఆస్థానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో వి.వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో నాగరత్నం, శాంతి పాల్గొన్నారు.

గౌతంబాడి

నాటు చక్కెరకు

## భౌగోళిక గుర్తింపు

అడయార్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తూయమిల్లి బియ్యం, గౌతంబాడి నాటు చక్కెరకు భౌగోళిక గుర్తింపు లభించింది. భౌగోళిక గుర్తింపు అనేది ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఉద్భవించి, ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం ఉపయోగింపబడే గుర్తుగా ఉంటుంది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో పలు వ్యవసాయ ఉత్పత్తులు ఉత్పత్తి చేసినా, ఒక నిర్దిష్ట ప్రదేశంలో లేదా ప్రాంతంలో ఉత్పత్తి చేయబడిన ఉత్పత్తులు ప్రత్యేకమైనవి. అవి ఉత్పత్తి చేయబడిన ప్రదేశం కారణంగా రుచి, నాణ్యత వంటి ప్రత్యేక లక్షణాలు కలిగి ఉంటాయి. రాష్ట్రంలో గత 2021 నుంచి 41 వ్యవసాయ ఉత్పత్తులకు వ్యవసాయ శాఖ పరిధిలోని వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు భౌగోళిక సూచికలు పొందేందుకు కృషిచేస్తోంది. ఈ క్రమంలో, తూయమల్లి బియ్యం, గౌతంబాడి నాటు చక్కెరకు భౌగోళిక గుర్తింపు లభించింది. ఈ గుర్తింపుతో వాటి డిమాండ్, ఎగుమతులు పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.

## టీవీకే బీఎల్‌ఏలకు 6 నుంచి శిక్షణ

అడయార్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అగ్రహీరో విజయ్ సారథ్యంలోని టీవీకే బూత్ లెవల్ అసిస్టెంట్ (బీఎల్ఏ)లకు ఈ నెల 6వ తేదీ నుంచి ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. ఈ శిక్షణా శిబిరాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ ఆదేశించారు. రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీవీకే 68,734 బూత్ కమిటీలను ఏర్పాటు చేసింది. ప్రతి కమిటీలోనూ ఐదుగురు సభ్యులను తొలుత నియమించారు. ఆ తర్వాత ఈ సంఖ్య 10 నుంచి 20కి పెంచారు. ఈ కమిటీలో 15 మంది పురుషులు, ఐదుగురు మహిళలకు చోటు కల్పించారు. ఈ కమిటీలోని సభ్యులకు ఈ నెల 6వ తేదీ నుంచి శిక్షణ ఇవ్వనున్నారు.

కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో

# మూడు ఏనుగుల మృతి

వేలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొండపల్లి రిజర్వ్‌డ్ ఫారెస్ట్ మూడు ఏనుగులు మృతిచెందాయి. వేలూరు డివిజన్ పరిధిలోని కొండపల్లి రిజర్వ్‌డ్ ఫారెస్ట్, ఆంధ్ర రాష్ట్రంలోని కౌండిన్య వన్యమృగాల సంరక్షణ కేంద్రం సమీపంలోని 5 కి.మీ దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. భైమాల ప్రాంతంలోని ఓ నది సమీపంలో రెండు ఏనుగులు, ఒక గున్న ఏనుగు కళేబరాలు దుర్గంధం వీచే స్థితిలో ఉన్నాయి. గురువారం సమాచారం తెలుసుకున్న విల్లుపురం చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎ.పెరియస్వామి, అన్నా జులాజికల్ పార్క్ ఫారెస్ట్ వెటర్నరీ అధికారి డా.శ్రీధర్‌లతో కూడిన బృందం ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఉత్తర్వులతో చిత్తూరు అటవీ అధికారులు కూడా ఆ ప్రాంతానికి చేరుకుని విచారణ చేపట్టారు. కళేబరాల నుంచి తీసిన శాంపిల్స్ పరిశోధన తర్వాత ఏనుగుల మృతికి కారణం తెలుస్తుందని రాష్ట్ర అటవీ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

## విద్యుత్ కంచెకు చిక్కుకుని ఏనుగు మృతి

అడయార్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లాలో విద్యుత్ కంచెకు చిక్కుకుని ఏనుగు మృతిచెందింది. బర్గూర్ కొండ ప్రాంతం ఈరట్టి రేంజ్‌లో ఏనుగు సహా పలు జంతువులు ఆహారం కోసం సమీపంలోని పంట పొలాలకు వచ్చి, మొక్కజొన్న సహా పలు పంటలు ధ్వంసం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, గురువారం ఉదయం ఓ ప్రైవేటు తోట చుట్టూ వేసిన విద్యుత్ కంచెకు చిక్కుకుని ఏనుగు మృతిచెంది పడి ఉండడం గమనించిన స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు అక్కడకు చేరుకుని, పశు వైద్యుల సాయంతో ఏనుగు కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి సమీపంలోని అడవిలో ఖననం చేసి, ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## శ్రీహర్‌లో ముగిసిన సీఏపీ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

చెన్నై, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని శ్రీరామచంద్రా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(శ్రీహర్)లో హ్యూమన్ జెనిటిక్స్ అండ్ బయోమెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో కోల్డ్ అట్మాస్ఫియరిక్ ప్లాస్మా(సీఏపీ)పై ఈ నెల 1న ప్రారంభమైన వర్క్‌షాప్ గురువారం ముగిసింది. బయోమెడికల్ అనువర్తనాల కోసం అయనీకరణ వాయువును ఉత్పత్తి చేసే బహుముఖ సాంకేతిక పరిజ్ఞానమే ఈ కోల్డ్ అట్మాస్ఫియరిక్ ప్లాస్మా. ఇది హానికరమైన సూక్ష్మజీవులను చంపగలదు. గాయాలను వేగంగా నయం చేయగలదు. క్యాన్సర్ కణాలను కూడా నాశనం చేయగలదు. ఈ ప్లాస్మా వైద్యంపై శ్రీహర్ హ్యూమన్ జెనిటిక్స్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రాజేష్‌కుమార్ జి తీవ్ర పరిశోధనలు సాగిస్తున్నారు. ఈ వర్క్‌షాప్‌లో డీన్ డాక్టర్ కల్పనా బాలకృష్ణన్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటాచలం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుమతి, హ్యూమన్ జెనెటిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ సోలోమన్ పాల్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీరేవతి తదితరులు పాల్గొన్నారు.

## తిరుత్తణిలో ఇల్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తిరుత్తణి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వెలిగించిన దీపం కారణంగా నిప్పంటుకుని ఇల్లు దగ్ధమైన సంఘటన తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... తిరుత్తణి ఇందిరానగర్‌కు చెందిన జయరామన్ అదే ప్రాంతంలో మిక్సీలు, ఏసీలు రిపేరు చేసే షాపు నడుపుకుంటూ తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో, గురువారం సాయంత్రం కార్తీక మాసం కావడంతో తన ఇంట్లో వెలిగించిన దీపం కారణంగా మంటలు వ్యాపించి, ఇల్లు మొత్తం దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని ఫైరింజన్ ద్వారా మంటలను అదుపుచేశారు. ఈ ఘటనలో సుమారు రూ.3లక్షల నగదు, రూ.3లక్షల వస్తువులు అగ్నికి ఆహుతైనట్లుగా బాధితులు తెలిపారు. పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి



సంతోష్ (ఫైల్‌ఫొటో)

తిరుత్తణి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో కానిస్టేబుల్ మృతిచెందిన సంఘటన తిరువళ్లూరు జిల్లా ఆవడిలో చోటుచేసుకుంది. ఆవడి బెటాలియన్‌లో తమిళనాడు స్పెషల్ పోలీస్ ఫోర్స్ విభాగంలో ట్రైనీ కానిస్టేబుల్‌గా సంతోష్ (28) విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో, గురువారం ఉదయం విధులకు హాజరైన అతను హఠాత్తుగా గుండెల్లో నొప్పిరావడంతో కిందపడి స్పృహకోల్పోయాడు. ఇది గమనించిన అతడి సహచరులు వెంటనే ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.